అన్నదాతకు దక్కని భరోసా

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలా చేయూత
- కూటమి ప్రభుత్వం వచ్చాక అందని పెట్టుబడి సాయం
- అటకెక్కిన ఉచిత పంటల బీమా
- పంటలకు లభించని గిట్టుబాటు ధరలు
- కాడి పడేస్తున్న రైతులు



వింజమూరులో తాళం వేసి ఉన్న రైతుసేవా కేంద్రం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతుపేరు ఎర్రగూటి మాలకొండయ్య. వరికుంటపాడు మండలం తూర్పుకొండారెడ్డిపల్లి గ్రామం. ఈయన బత్తాయి,వరి, మినుము, కంది పైర్లు సాగు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా పథకం కింద రూ.67,500వేలు అందాయి. యంత్రసేవా పథకం కింద ట్రాక్టర్ వ్యవసాయ పరికరాలను 50శాతం రాయితీపై పొందారు. ఆర్‌బీకేల ద్వారా ఇంటి వద్దకే విత్తనాలు, పురుగుమందులు అందజేయడంతో రవాణా ఖర్చులు మిగిలాయి. ఇలా గత ప్రభుత్వంలో దాదాపు రూ. 2లక్షల వరకు ప్రయోజనం పొందారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ సాయం అందలేదని, పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించక నష్టపోతున్నామని మాలకొండయ్య ఆవేదన చెందారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ఎం రత్తయ్య. వింజమూరు మండలం శంఖవరం గ్రామం. ఈయనకు మూడెకరాల భూమి ఉంది. బోర్లు ఉన్నా నీరు సక్రమంగా రావు. వర్షాలు బాగాపడి చెరువులో నీరు చేరితేనే పంటలు పండుతాయి. గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.13500 చొప్పున ఐదేళ్లు పెట్టుబడి సాయం, సబ్సిడీపై విత్తనాలు అందడంతో సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి రాలేదు. గతేడాది వర్షాలు సక్రమంగా కురవక అరకొరగా పంటలు పండాయి. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. దీనికితోడు పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించకపోవడంతో నష్టాలు తప్పలేదని రత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ఉదయగిరి/ఆత్మకూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనలో ఎక్కువ కాలం వర్షాలు కురవక, పంటలు లేక అనేక కుటుంబాలు వలస బాట పట్టాయి. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక మళ్లీ వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లెలు పచ్చని పంటలతో కళకళలాడాయి. ఆ తరువాత నవ్యాంధ్రప్రదేశ్ తొలి సీఎంగా ఉన్న బాబు పాలనలోనూ రైతుల కష్టాలు వర్ణనాతీతం. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలవడంతో వ్యవసాయం పండగలా సాగింది. అన్నదాతలకు రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందజేయడంతో పాటు గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పల్లె దాటకుండా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను వారి ముంగిటకే చేర్చారు. రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేశారు. ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి పరిహారాన్ని సైతం అందజేశారు. ఆ ఐదేళ్ల జగనన్న పాలనలో పల్లెలు పాడి పంటలతో పరవశించాయి. కానీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతులతో అనుబంధాన్ని పెంచుకున్న రైతుభరోసా కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. అన్నదాతలకు అన్నదాత సుఖీభవ పేరుతో అందజేస్తామన్న ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేశారు. బ్యాంకుల్లో తీసుకునే వ్యవసాయ రుణాలకు సంబంధించిన సున్నావడ్డీ పథకానికి సున్నా చుట్టారు. అరకొరగా సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్నా అవి అధికారపార్టీ వారికే ఇస్తున్నారు. వ్యవసాయ పరికరాల తీరు అంతే. ఆరుగాలం శ్రమించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలోనూ విఫలమైంది. ధాన్యం ధరలు పతనమవడంతో రైతులు పుట్టికి దాదాపు రూ.5వేల వరకు నష్టపో యారు. ఈ ఏడాది పాలనలో అన్నదాతలు పడుతున్న బాధలు వారికే ఎరుక. వ్యవసాయం పండగ అనే దశ నుంచి దండగ అనే పరిస్థితుల్లోకి వస్తున్నారు.

గత ప్రభుత్వంలో రైతులు పొందిన లబ్ధి

పథకం పేరు	రైతుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
ఉదయగిరి నియోజకవర్గం		
రైతుభరోసా	37,149	250.75
ఉచిత పంట బీమా	1250	1.98
సున్నా వడ్డీ	9,140	33.00
ఆత్మకూరు నియోజకవర్గం		
రైతుభరోసా	36,710	247.79

పుట్టికి రూ.5వేలు నష్టపోయాం



గతేడాది ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించడంతో రైతులందరూ ఆనందంగా ఉన్నారు. ఈ ఏడాది కూటమి పాలనలో ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించలేదు. దాదాపు పుట్టికి రూ.5వేలు చొప్పున నష్టపోయారు. గత ప్రభుత్వంలో ఏటా క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందగా, ఈ ప్రభుత్వం వచ్చాక ఆ సాయం కూడా అందలేదు. చంద్రబాబు పాలనలో రైతుల సంక్షేమాన్ని పట్టించుకోరు.

–నోటి వెంకటేశ్వర్లరెడ్డి, రైతు, యనమదల, చేజర్ల మండలం

మళ్లీ అప్పుల భయమేస్తోంది



గత ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలను అర్థం చేసుకుని ఏటా సాగుకు ముందే పెట్టుబడి సాయాన్ని బ్యాంకుల్లో జమ చేశాడు. చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ ఏడాది ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక రూ.60 వేలు నష్టపోయాం. మళ్లీ అప్పుల పాలవుతామేమోనని భయంగా ఉంది.

– నెల్లూరు శీనయ్య, రైతు, సంగం

నమ్మకం సన్నగిల్లుతోంది



గత ప్రభుత్వ పాలనలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కాకముందే సాగుకు పెట్టుబడి సాయం అందేది. దీంతో అప్పుల చేయాల్సిన అవసరం ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించే పెట్టుబడి సాయం అందుతుందనే నమ్మకం సన్నగిల్లుతోంది.

–ఆర్ వెంకట రెడ్డి, రైతు, డీసీపల్లి, మర్రిపాడు మండలం

క్లుప్తంగా

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చేజర్ల (ఆత్మకూరు) : చేజర్ల మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తున్నామని ఏఓ వీ శశిధర్ శనివారం తెలిపారు. జీలుగలు కేజీ రూ. 61.50, జనుములు కేజీ రూ.54.50, పిల్లిపెసర్లు కేజీ రూ.90 చొప్పున అందజేస్తున్నామని చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు జమచేస్తే వెంటనే అందజేస్తామని తెలిపారు.

11న పద్మశాలి ప్రతిభ పురస్కారాల ప్రదానం



అనుమసముద్రంపేట: 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు జూన్ 11న నెల్లూరులోని డీజీపీ కల్యాణ మండపంలో ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, జానపాటి రామసుబ్బయ్య జొన్నాదుల వేణుగోపాలయ్య తెలిపారు. శనివారం వారు సంగం, తలుపూరుపాడు, ఏఎస్‌పేట, ఆత్మకూరు, రామస్వామిపల్లి గ్రామాల్లో పర్యటించారు. పద్మశాలియుల ప్రతినిధులను కలుసుకుని ప్రతిభాపురస్కాల ప్రదానానికి ఆహ్వానించారు. పదో తరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు నెల్లూరులోని సిరి థియేటర్ ఎదురుగా ఉన్న లక్ష్మీశ్రీనివాస డిజిటల్ ప్లాజాలో మార్కుల లిస్టు, కులధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని కోరారు.

జమ్ముమానేశ్వరునికి ప్రత్యేక పూజలు

సోమశిల: అనంతసాగరం సమీపంలోని జమ్ముమానుకుంట వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్ముమానేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతసాగరానికి చెందిన వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా జమ్ముమానేశ్వరునికి రుద్రాభిషేకం, విశేష పూజలు, భవానీ మాతకు నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం వెంకయ్యస్వామికి పూలంగిసేవ, పల్లకిసేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కండక్టర్లకు సన్మానం



ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పీవీ శేషగిరిరావు, సీహెచ్ హరిప్రసాద్, షేక్ అహ్మద్‌బాషాను ఎన్‌ఎంయూ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎన్‌ఎంయూ మాజీ డిపో కార్యదర్శి సయ్యద్ మౌలాలి, డిపో గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ ,నాయకులు రమణరాజు, నాగరాజు, వెంకటేశ్వర్లు, సలాం, ఎం వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం కీలకం



మర్రిపాడు: పంటల సాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయశాస్త్రవేత్త నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పొంగూరులో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భూసార పరీక్షల్లో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్ మినుము, పెసర పంటల సాగులోని మెళకువలను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త విజయ్ కుమార్‌నాయక్ బొప్పాయి, నిమ్మ, పొగాకు సాగులో తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మండల ఉద్యాన అధికారి రాజశేఖర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ చిన్నకొండారెడ్డి, పొంగూరు ఉపసర్పంచ్ శివప్రసాద్, వీఏఏ పెంచలయ్య పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 389 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 294 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.252.02 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ

సంగం: మండలంలోని దువ్వూరులోని వ్యవసాయ పొలాల్లోని రెండు విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ బ్యాటరీ శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు సంగం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

సీపీఎం సమైక్యతా ర్యాలీ



సోమశిల: దేశ సమగ్రత, మత సామరస్యం పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సమైక్యత ర్యాలీని అనంతసాగరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ గత నెలలో పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడం బాధాకరమన్నారు. ఉగ్రదాడిని దేశ ప్రజలందరూ కుల,మతాలకు అతీతంగా ఒక్కటిగా కలిసి ఎదుర్కొన్నారన్నారు. అన్నిరాజకీయ పార్టీలు ఉగ్రవాదులను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ పరిణామాల్లో దేశ సైనికులు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, ఉప్పలపాడు మస్తాన్, వెంకటేశ్వర్లు జావీద్ బాబు, ఎజాజ్, అశోక్, నరసింహులు, మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్డి విద్యార్థులకు ఉపకార వేతనాలు



స్క్రీనింగ్ టెస్ట్ పేపర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కావలి (జలదంకి): రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుపేద రెడ్డి విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కూరపాటి కృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల ఆవరణలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్న పది, ఇంటర్మీడియట్‌కు చెందిన పేదరెడ్డి విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పేదరెడ్డి విద్యార్థులు ఉన్నత చదువులకు ఇబ్బందులు పడుతున్న క్రమంలో వారికి ఉపకార వేతనాలను అందజేసి అండగా నిలవాలనే సంకల్పంతో రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా రెడ్డి ఫౌండేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేశామని, వాట్సప్ ద్వారా విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. స్క్రీనింగ్‌టెస్ట్‌కు దాదాపు 300 మంది హాజరయ్యారని, ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తామని తెలిపారు. స్క్రీనింగ్‌టెస్ట్‌ను బత్తిన ప్రభాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

శ్రీధర్ సేవలు అభినందనీయం



జలదంకి: గత 36 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా, విద్యాశాఖ అధికారిగా కాండారు శ్రీధర్ అందించిన సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారి కాండారు శ్రీధర్ ఉద్యోగ విరమణ సభను శనివారం నిర్వహించారు. శ్రీధర్, శ్రీదేవి దంపతులను పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. శ్రీధర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన శేషజీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు.

ప్రణాళికల మేరకు అభివృద్ధి పనులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించామని, ఆ మేరకు పనులు వేగవంతం చేయనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆత్మకూరు ఆర్డీఓ బీ పావనితో కలిసి శనివారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో తక్షణం నిర్మించాల్సిన రోడ్ల గురించి ప్రతిపాదనలు అందాయని, ఇందుకోసం రూ.5.43 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ఉండే వార్డుల్లో 50 శాతం రోడ్డు పనులను ఇన్‌చార్జిలకు కేటాయించనున్నట్లు తెలిపారు.

రూ.25కోట్లతో బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం

సంగం: వీర్లగుడిపాడు నుంచి జాతీయ రహదారికి అనుసంధానిస్తూ రూ.25 కోట్లతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన వీర్లగుడిపాడులో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జూన్ 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నూతన పింఛన్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 3492, ఆత్మకూరు నియోజకవర్గంలో 480 మందికి నూతనంగా పింఛన్లు అందజేయనున్నట్లు వివరించారు. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణంతో గ్రామానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వివరించారు. ఏడు కిలోమీటర్ల మేర తారురోడ్డు, బ్రిడ్జి నిర్మించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారన్నారు. త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ ఆమోదం తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, కమిషనర్ సీ గంగాప్రసాద్, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, పీఆర్ ఎస్ఈ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సోమ్లా నాయక్, ఎంపీడీఓ షాలెట్, డీఎస్పీ వేణుగోపాల్, సీఐలు వేమారెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణాల్లో తనిఖీలు

దుత్తలూరు: మండలంలోని చౌక దుకాణాలను తహసీల్దార్ వై నాగరాజు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేసిందని తెలిపారు. జూన్ నుంచి చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5వ తేదీలోగా 65 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరులకు అందజేయాలని, అందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని డీలర్లకు సూచించారు. మిగిలిన వారికి చౌక దుకాణాల్లో 1 నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించిన రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ పీ చెన్నారెడ్డి శనివారం తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితాను మండల వ్యవసాయాధికారి లాగిన్ ద్వారా ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు. ఉదయగిరి 9,485, సీతారాంపురం 6,344, వరికుంటపాడు 11,428, దుత్తలూరు 10,059, మర్రిపాడు 11,428 మంది అర్హత సాధించారని చెప్పారు.ఆర్టీజీఎస్ వారు తిరిగి అర్హత సాధించిన రైతుల జాబితాను రైతుసేవా కేంద్రాలకు పంపడం జరుగుతుందన్నారు. అందులో పేర్లు ఉన్న వారు వీపీఏలను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకుంటేనే నగదు జమవుతుందని తెలిపారు.

రామాలయ నిర్మాణానికి టీటీడీ నిధుల మంజూరు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలలో సీతారామస్వామి ఆలయ నిర్మాణం కోసం టీటీడీ నిధులను మంజూరు చేసిందని ఆలయ కమిటీ చైర్మన్ అంకినపల్లి ఓబులరెడ్డి శనివారం తెలిపారు. ఆలయ నిర్మాణానికి కోటి రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. గ్రామస్తులు విరాళాల ద్వారా రూ.25 లక్షలు సమకూర్చుతుండగా, మిగిలిన రూ.75 లక్షల మొత్తాన్ని టీటీడీ అందజేస్తోందన్నారు. టీటీడీ నిధుల మంజూరుకు సహకరించిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీటీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూకోర్టు



ఆత్మకూరురూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ కోర్టును శనివారం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి, నరసారావుపల్లి గ్రామాల్లో నెలకొన్న భూ వివాదాలకు సంబంధించి ఇరువర్గాలను విచారించి రికార్డులను పరిశీలించారు. మరోసారి రెవెన్యూకోర్టు నిర్వహించి ఇరువర్గాలను విచారించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలిగిరి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శనివారం ఆయన వీర్నకొల్లులో పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలలో పక్కాగృహ నిర్మాణాలను ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసి బిల్లులు పొందాలని నిర్మాణదారులకు సూచించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో ఆదివారం నుంచి మూడ్రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని సూచించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పెన్నా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటే దాటవద్దని తెలిపారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు, పశువుల కాపరులు పొలాల్లోకి వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. వర్షం కురిసే సమయంలో పశువులను కరెంటు స్తంభాలకు కట్టేయరాదని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో 91009 48215 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



దుత్తలూరు: మండలంలో వెంకటంపేటలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో మూడ్రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం సీతారామలక్ష్మణుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించి మహాకుంభాభిషేకాన్ని పూర్తి చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో సీతారాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఇన్‌చార్జిల పాలనతో ప్రజల ఇక్కట్లు



సాయంత్రం వేళ ఆత్మకూరులో విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సోమ్లానాయక్

ఆత్మకూరురూరల్: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సొంత నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులో ప్రధాన శాఖలకు సంబంధించిన విభాగాల్లో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. ఆత్మకూరు తహసీల్దార్ సుదీర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సంగం తహసీల్దార్ సోమ్లానాయక్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. అలాగే ఆత్మకూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఐజాక్ ప్రవీణ్ నెలన్నర రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో ఈఓఆర్డీ డేవిడ్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు ప్రధాన శాఖలకు సంబంధించిన ఇన్‌చార్జి అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండకపోవడం, బాధ్యతలు నిర్వహించలేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి మృతి

ఉదయగిరి: ఉదయగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శివప్రియ(22) అనే యువతి చెన్నైలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివరాలు.. మండలంలోని జి.చెరువుపల్లి పంచాయతీ వడ్డిపాళేనికి చెందిన శివప్రియను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రేమించి మోసం చేసి వేరే యువతిని పెళ్లి చేసుకునేందు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్యన జరిగిన గొడవలో మనస్తాపం చెందిన శివప్రియ పోలీసుస్టేషన్ ఆవరణంలో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఆమెను చెన్నైలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహానికి శవపరీక్ష చేసి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

అపహాస్యం పాలైన పౌరహక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న డీటీ స్వరూప్

ఆత్మకూరు రూరల్: మండలంలోని బోయలచిరివెళ్ల ఎస్సీకాలనీలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం అపహాస్యం పాలై పలు విమర్శలకు దారి తీసింది. ప్రతి నెలలో చివరి శనివారం ఒక్కో దళితవాడలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి స్థానిక సమస్యలపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాలు క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలకు పరిష్కారం చూపాయి. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో లైన్ డిపార్ట్‌మెంట్ శాఖలుగా భావించబడే పంచాయతీరాజ్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, న్యాయ, తదితర శాఖలతో పాటు స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని తీర్మానాలు చేయాలి. అయితే శనివారం బోయలచిరివెళ్లలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో డీటీ స్వరూప్, వసతి గృహ వార్డెన్ పద్మనాభరెడ్డి, వైద్యఆరోగ్య శాఖకు చెందిన సైదా తప్ప ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనకపోవడం విశేషం. అంతకంటే దారుణం కార్యక్రమం నిర్వహణపై స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లుకు కూడా సమాచారం ఇవ్వకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ మంతు యానాదిరెడ్డిని మాత్రం ముఖ్యఅతిథిగా పిలిచి కార్యక్రమాన్ని మమ అనిపించారు. స్థానికులు పట్టుమని పదిమంది కూడా కార్యక్రమానికి హాజరుకాకపోవడం గమనార్హం. మరీ లోతుగా విచారిస్తే లైన్‌డిపార్ట్‌మెంట్ అధికారులు తమకు కార్యక్రమం నిర్వహణపై సమాచారమేలేదని, తమ పేర్లు బయటపెట్టొద్దని తెలిపారు.